ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్నూలు
జిల్లా వార్తలు
శుక్రవారం 29 మార్చి 2024



రంజాన్ వేళలు



	ఇఫ్తార్(శుక్రవారం)	సెహరీ(శనివారం)
కర్నూలు	6:32 (సాయంత్రం)	5:05 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:32 (సాయంత్రం)	5:06 (ఉదయం)
ఆదోని	6:37 (సాయంత్రం)	4:53 (ఉదయం)

కార్మికుల కడుపు కొట్టారు..!



ఆర్ఎస్ రోడ్డులో పనుల కోసం వేచి ఉన్న కూలీలు

నిర్మాణ రంగంపై ఆధారపడ్డ అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసింది. ఆ సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మాటలతో గారడీ చేశారు. వాగ్దానాలతో మభ్యపెట్టారు. మన ప్రభుత్వం వస్తే కార్మికుల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు చేపడతామని కనికట్టు చేశారు. నిజమేనేమో అని నమ్మి ఓట్లు వేసిన కార్మికులను నట్టేట ముంచారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన పలు కార్మిక సంక్షేమ పథకాలను రద్దు చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోనే అమలు చేసే పథకాలే అసంఘటిత కార్మికలకు కూడా వర్తిస్తాయని మాయ చేశారు. ఐదేళ్ల క్రితం వివిధ పథకాల కోసం జిల్లా నలుమూల నుంచి వచ్చే కార్మికులతో కళకళలాడిన కార్మిక శాఖ నేడు వెలవెలబోతోంది. జగన్ ఆడిన ఓట్లాటలో అసంఘటిత కార్మికులు ఓడిపోయారని కార్మిక సంఘాల నేతలు ఆవేదన చెందుతున్నారు. గతంలో వృత్తి పని ముట్లు ఇస్తే.. ఈ జగన్ వచ్చాక ఆపేశారని తాపీ మేస్త్రీలు ఆక్రోశిస్తున్నారు.

కర్నూలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇ-శ్రమ లెక్కలు ప్రకారం 11,38,876 మంది కార్మికులు, అసంఘటిత కార్మికులు ఉన్నారు. వారిలో కర్నూలు జిల్లాలో 5,41,236 మందికి గానూ ఇ-శ్రమ కింద 2,21,277 మంది నమోదు చేసుకున్నారు. నంద్యాల జిల్లాలో 5,97,460 మందికి గాను 2,91,910 మంది నమోదు చేసుకున్నారు. అలాగే.. కర్నూలు జిల్లాలో బిల్డింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (బీఓసీ) కార్మికులు 1,51,676 మంది ఉంటే.. వీరందరికి బీఓసీ గుర్తింపు కార్డులు కార్మిక శాఖ జారీ చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. గత టీడీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం చంద్రబాబు కార్మికులు, అసంఘటిత కార్మికుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేశారు. 2019 మే 30న సీఎం జగన్ బాధ్యతలు చేపట్టాక వైసీపీ ప్రభుత్వం ముప్పాతిక శాతం కార్మిక పథకాలను రద్దు చేసింది. కొన్నింటిని మాత్రం కార్మిక శాఖ నుంచి తొలగించి.. గ్రామీణ ప్రజల కోసం డీఆర్‌డీఏ అమలు చేస్తున్న పథకాలే కార్మికులకు కూడా వర్తిస్తాయి.. ప్రత్యేకంగా కార్మిక శాఖ పర్యవేక్షణలో అమలు చేయకుండా ఆపేశారు.



ఏదీ నైపుణ్య శిక్షణ



భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పని చేసే అసంఘటిక కార్మికులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి టీడీపీ ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. శిక్షణ కాలంలో ప్రతి రోజూ రూ.300 స్టయిఫండ్ ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక నైపుణ్య శిక్షణ ఎత్తేశారు.

డీఆర్‌డీఏ ఆఫీసుకు వెళ్లాల్సిందే

భవన, నిర్మాణ నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డు ఉన్న కార్మికులు ఎవరైనా 18 ఏళ్ల పైబడిన తమ కూతురికి పెళ్లి చేయాలంటే చంద్రన్న పెళ్లి కానుక కోసం కార్మిక శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకునేవారు. అలాగే.. ప్రమాదంలో మరణించిన, గాయపడినా చంద్రన్న బీమా కోసం కార్మిక శాఖ కార్యాలయం తలుపులు తట్టేవారు. ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.5 లక్షలు ఇచ్చేవారు. సాధారణ మరణం పొందితే రూ.60 వేల ఆర్థిక సాయం అందేది. గుర్తింపు కార్డు లేని కార్మికులు మరణించినా కూడా రూ.50 వేలు వచ్చేవి. ఇవే పథకాలు డీఆర్‌డీఏ అమలు చేస్తుందని, అక్కడా.. ఇక్కడా రెండు చోట్ల కార్మికులు లబ్ధి పొందే అవకాశం ఉందని జగన్ ప్రభుత్వం సరికొత్త వాదనకు తెర తీసి ఈ పథకాల డీఆర్‌డీఏకే దరఖాస్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 11 సంక్షేమ పథకాలు కార్మిక శాఖ పరిధి నుంచి తీసేసినట్లు అధికారులే పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇ-శ్రమ్ తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఏ ఒక్క పథకం కూడా కార్మిక శాఖ అమలు చేయడం లేదని ఓ అధికారి పేర్కొనడం కొసమెరుపు.

- పలు కార్మిక సంక్షేమ పథకాలు రద్దు
- కొన్ని పథకాలు డీఆర్‌డీఏలో విలీనం
- టీడీపీ ప్రభుత్వంలో చంద్రన్న బీమా, వృత్తి పరికరాలు
- జగన్ ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యమవుతున్న కార్మిక శాఖ



నాణ్యమైన వృత్తి పరికరాలు పంపిణీ చేసిన చంద్రన్న

నిర్మాణ రంగాలపై ఆధార పడిన తాపి మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ కార్మికులు తమకు అవసరమైన వృత్తి పనిముట్ల కోసం అప్పులు చేయాల్సిన దైన్య పరిస్థితి ఉండేది. చంద్రబాబు వారి ఆర్థిక ఇబ్బందులు గుర్తించి నాణ్యమైన ప్రముఖ కంపెనీల వృత్తి పనిముట్లను పంపిణీ చేశారు. జిల్లాలో 1,283 మంది తాపి మేస్త్రీలు, 2,650 మంది ఎలక్ట్రీషియన్లు, 550 మంది ప్లంబర్ వర్కర్లు కలిపి 4,485 మందికి వారి వృత్తికి అవసరమైన పని ముట్లు పంపిణీ చేశారు. ఒక్కో కార్మికుడిపై సగటున రూ.25 వేల నుంచి రూ.లక్షకు పైగా ఖర్చు చేశారని కార్మిక సంఘం నాయకుడు రామాంజనేయులు పేర్కొన్నారు. అయితే.. సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టాక కార్మికులకు శాపంగా మారింది. వృత్తి పనిముట్ల పంపిణీ పథకం రద్దు చేశారు. ఈ ఐదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదని కార్మిక శాఖ అధికారులే అంటున్నారు.



ముగిసిన పది పరీక్షలు

ఊపిరి పీల్చుకున్న అధికారులు, విద్యార్థులు



పరీక్షలు పూర్తయిన ఆనందంలో విద్యార్థినులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 28: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. అయితే ఈ నెల 30వ తేదీ వరకు ఒకేషనల్ కోర్సు పరీక్షలు జరగనున్నాయి. ఏడాది పాటు కష్టపడి చదివిన పది పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం జరిగిన సంస్కృతం సబ్జెక్టు పరీక్షకు మొత్తం 3856 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 3834 మంది హాజరు కాగా, 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాలను జిల్లా పరిశీలన అధికారి గీత, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌తో పాటు పర్యవేక్షణ బృందాలు పర్యవేక్షించాయి. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు.

ఉపాధి కూలి రోజుకు రూ.300


- ఏప్రిల్ నుంచి అమలు
- డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 28: ఉగాది పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులు చేసే రైతులు, రైతు కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ మేరకు గతంలో ఉన్న ఉపాధి కూలిని రూ.272 నుంచి రూ.300కు పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి పెరిగిన కూలీ ధరను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిన ఉత్తర్వుల్లో సూచించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేసేందుకు జాబ్‌కార్డులు పొందిన దాదాపు ఆరు లక్షల మంది రైతులు, కూలీలకు ప్రయోజనం కలగనుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి దాకా అమలు చేస్తున్న రూ.272 కూలీ మొత్తాన్ని ఏప్రిల్ 1 నుంచి పెంచనుందని, కనీసం రూ.10 అదనంగా ఇచ్చే అవకాశం ఉందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే.. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఏకంగా అదనంగా రూ.28 పెంచడంపై రైతుల్లో కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది. అయితే.. పెంచిన మొత్తాన్ని తప్పనిసరిగా పనులు చేసే రైతులు, కూలీలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని నీటి యాజమాన్య సంస్థ జిల్లా అధికారి అమర్నాథ్ రెడ్డిని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం విజ్ఞప్తి చేశారు.

క్షమాగుణం క్రీస్తు మార్గం

- నేడు గుడ్‌ఫ్రైడే
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

కర్నూలు(కల్చరల్), మార్చి 28: క్షమాగుణం, దయామయ జీవనం, సౌభ్రాతృత్వం ఏసుక్రీస్తు మానవాళికి చూపిన మార్గం. మానవులు చేసిన పాపాల కోసం ఆయన శిలువపై ప్రాణాలు అర్పించాడు. తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచాడు. పొరుగువారిని ప్రేమించాలని, వారి తప్పులను క్షమించాలని బోధించారు. క్రైస్తవ మత విశ్వాసం ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం శిలువ వేయబడ్డారు. ఈ నేపథ్యంలో క్రీస్తు ప్రభువును స్మరించుకుంటూ శుక్రవారం రోజున ఉమ్మడి జిల్లాలోని క్రైస్తవులు 'గుడ్‌ఫ్రై డే' వేడుకను నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. దయామయుని తలుస్తూ ఉపవాసంతో ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంగా అన్ని చర్చిలలో గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.



నగరంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు...

నగరంలోని సీఎస్ఐ చర్చి, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, స్టాంటన్ చర్చి, ప్రార్థన మందిరాలలో, వివిధ ప్రాంతాల్లోని చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రై డే ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

అన్ని రంగాల్లో జగన్ వైఫల్యం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

గూడూరు, మార్చి 28: అన్ని రంగాల్లో సీఎం జగన్ రెడ్డి విఫలమయ్యారని జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని కె.నాగులాపురం గ్రామంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు, కోడుమూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ రెడ్డి జిల్లా పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని, ఇప్పుడు జిల్లాకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నించారు. హామీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. బనగానపల్లె క్వారీలో చనిపోయిన కార్మికులకు బీమా కల్పిస్తామని చెప్పి ఆ హామీని ఇంత వరకు సీఎం జగన్ నెరవేర్చలేదన్నారు. జగనన్న కాలనీల పేరిట ఊరికి దూరంగా ఒకటిన్నర సెంటు స్థలాన్ని ఇచ్చి ఇప్పటికి పూర్తి చేయలేకపోయారని ధ్వజమెత్తారు. జిల్లాలో సాగు, తాగునీరు అందించలేని, రోడ్లు వేయలేని ఈ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు జే సురేష్, కె.క్రిష్ణ, గోపాల్ రెడ్డి, కరణం చిన్న గిడ్డయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు, బంగారు శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీటీ నాయుడు

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించండి

కలెక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 28: పోలింగ్ కేంద్రాల్లో ఏప్రిల్ 1వ తేదీ నాటికి అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.జి. సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు లైట్లు, ఫ్యాన్లు, బాత్‌రూమ్ వంటివి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి ప్రసన్న, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఈడబ్ల్యూఐడీసీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైతే చర్యలు

ఈ నెల 30, ఏప్రిల్ 1న నిర్వహించనున్న ఎన్నికల శిక్షణా కార్యక్రమాలకు బూత్ లెవెల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని కలెక్టర్ డా.జి. సృజన హెచ్చరించారు. గురువారం ఎన్నికల అంశాలపై ఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలుపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృంధాలతో సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతికూల వార్తలతో కౌంటర్‌చెక్ చేసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, జడ్పీసీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

అట్టర్ ఫ్లాప్..!

- ఫెయిల్ అయిన జగన్ 'మేమంతా సిద్ధం' సభ
- ఎండవేడిమికి తట్టుకోలేక జారుకున్న జనాలు
- సీఎం స్పీచ్ వినలేక ప్రజలు పరార్..!



సీఎం మాట్లాడుతుండగా ఖాళీ అవుతున్న సభాస్థలం

నంద్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయింది. మధ్యాహ్నానికే జనాన్ని తరలించగా ఎండ వేడిమికి తట్టుకోలేక జనాలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం జగన్ వచ్చే సమయానికి సభా స్థలి ఖాళీ అయింది. గురువారం మొదట ఆళ్లగడ్డలోని విడిది కేంద్రం నుంచి నంద్యాల వరకు బస్సు యాత్ర సాగింది. సాయంత్రం నంద్యాల పట్టణంలో సభలో సీఎం జగన్ ప్రసంగించారు. అట్టహాసంగా రెండో రోజు మొదలు పెట్టిన యాత్ర, సభ ఫెయిల్ కావడంతో సీఎం జగన్‌తోపాటు, జిల్లా నాయకుల ముఖాలన్నీ వాడిపోయాయి. ముప్పావు వంతు ఖాళీగా ఉన్న సభలోనే సీఎం జగన్ ప్రసంగించి, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించడని కోరారు. అదే మూసకట్టు ప్రసంగాన్ని వినలేక ప్రజలు అక్కడి నుంచి జారుకున్నారు. సభాస్థలిలో నాయకులకు తప్పా సభకు వచ్చిన సామాన్య ప్రజానీకానికి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో సభకు వచ్చిన వారంతా ఎండ వేడిమికి, దప్పికకు అలమటించారు. చివరలో ఉన్న వారికి నీటిని అందించిన, సభా ప్రాంగణం మధ్యలో ఉన్న వారికి నీరందించే వారు లేక ఇబ్బంది పడ్డారు.

డబ్బులిచ్చి తరలించారు..

వైసీపీ నేతలు ఒక్కొక్కరికి రూ.200 ఇచ్చి జనాన్ని తరలించినట్లు తెలుస్తోంది. పురుషులకైతే క్వార్టర్ బాటిల్ అదనం. మందు బాబులు సభా ప్రాంగణంలోనే తాగిపడిపోయారు. బస్సు యాత్ర ఆళ్లగడ్డ నుంచి మొదలైన తర్వాత అదే మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో రైతులు, మేధావులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసేందుకు ముందుగా ప్రణాళికలు వేసుకున్నారు. వారు ఎంపిక చేసుకున్న వారు సీఎం జగన్‌తో మాట్లాడే విధంగా వారిలోని కొంతమందికి టోకెన్లు కూడా జారీ చేశారు. ఆ టోకెన్ల వారిగా మాట్లాడించేలా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అయితే వైసీపీ వారు అనుకున్నట్లుగా రైతులు, మేధావులు సమావేశానికి హాజరు కాకపోవడంతో, వచ్చిన వారితోనే ముఖాముఖి నిర్వహించినట్లు సమాచారం.



డబ్బులు ఎక్కడ జగనన్నా..!



- బటన్లు నొక్కినా జమకాని నిధులు
- ఎదురు చూస్తున్న పలు పథకాల లబ్ధిదారులు
- వస్తాయో రావోనన్న ఆందోళన

నంద్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):

'ఎన్నికల కోడ్ మరో కొద్ది రోజుల్లో వస్తుంది కాబట్టి ప్రస్తుతం బటన్ మాత్రమే నొక్కుతున్నాను. డబ్బులు మరికొద్ది రోజుల్లో పడతాయి. వైసీపీ ప్రభుత్వం ఇలా చేస్తున్నందుకు లబ్ధిదారులు ఏమీ భయపడాల్సిన అవసరం లేదు. ఈ కొద్ది రోజులు నాకు వ్యతిరేకంగా రాసే పత్రికలను చూడవద్దు' ఇదీ ఈ నెల 14న బనగానపల్లెలో ఈబీసీ నేస్తం పథకం బటన్ నొక్కుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు. ఈబీసీ నేస్తం డబ్బులు మాత్రమే జమ కాలేదంటే సరేలే అనుకోవచ్చు. ఈ సంవత్సరం జనవరి నుంచి వివిధ పథకాల లబ్ధిదారులకు డబ్బులు జమ చేసే బటన్ నొక్కుతూనే ఉన్నారు. అయినా లబ్ధిదారులకు డబ్బులు జమ కాలేదు. వారి ఇబ్బందులు తీరలేదు. ఇలా అబద్ధాలు చెబుతున్న జగన్ మళ్లీ ఎన్నికల ప్రచారానికి రావడంపై జిల్లా ప్రజలు తీవ్ర వ్యతిరేకత చాటుకుంటున్నారు.

అందని విద్యా దీవెన..

వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన ద్వారా ప్రభుత్వం ఫీజుల సొమ్మును వాయిదా రూపంలో వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ ఏడాది విద్యా దీవెన పథకానికి సంబంధించి సీఎం జగన్ ఈ సంవత్సరం మార్చి 1న బటన్‌ను నొక్కారు. జిల్లా వ్యాప్తంగా 30,136 మంది తల్లులకు 33481 మంది విద్యార్థులకుగాను రూ.24.44 కోట్లు వైసీపీ ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఈ డబ్బులు ఇంకా తల్లుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థుల ఫీజు కట్టలేకపోయారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఫీజులు చెల్లించాలంటూ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల మీద ఒత్తిడి తెస్తున్నాయి. విద్యార్థులు చదువుల మీద మనసు లగ్నం చేయలేక ఇబ్బంది పడుతున్నారు. 'చెప్పాడంటే.. చేస్తాడంతే!' అంటూ వైసీపీ నాయకులు గొప్పలు పోవడం తప్పితే, సీఎం జగన్ చేస్తున్నది ఏమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పథకాలు అందిస్తున్నామని చెబుతూ తమని మోసం చేయటమే కాక, తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు సీఎం జగన్ మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏదీ చేయూత..?

తమది పూర్తిగా పేదల పార్టీ అని.. అందుకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందిన 45-60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పేద మహిళలకు ఏటా రూ.18,500 అందించేందుకు వైఎస్సార్ చేయూత పథకాన్ని తీసుకు వచ్చామని సీఎం జగన్ బాకా ఊదారు. ఈ పథకం నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీన నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన 97,254 మంది మహిళలకు రూ.182.35 కోట్లు విడుదల చేశారు. సీఎం బటన్ నొక్కారని, ఇక తమ ఖాతాల్లో డబ్బులు జమ కావడమే తరువాయి అని ఆశ పడ్డ మహిళలకు నిరాశే మిగిలింది. వైసీపీ ప్రభుత్వం ఇస్తానన్న చేయూత అంతా వట్టిదేనని, సీఎం జగన్ ఇలా తమను మభ్యపెట్టడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈబీసీ కాపు నేస్తం అంతేనా..?



ఈబీసీ నేస్తం ద్వారా అగ్రవర్ణ పేదలకు అంతులేని మేలు చేస్తున్నానంటూ, జిల్లాలో ప్రస్తుతం 17,652 మందికి రూ.26 కోట్లు అందిస్తున్నట్లు ఈ నెల 14న బనగానపల్లె సభలో సీఎం జగన్ చెప్పారు. పనిలో పనిగా ప్రస్తుతానికి బటన్ మాత్రమే నొక్కుతున్నానని, డబ్బులు వారం పది రోజుల తర్వాత పడతాయని చావు కబుర్లు చల్లగా చెప్పారు. పైగా తాను మంచి చేద్దామని చూస్తుంటే కొన్ని పత్రికలు తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాయని, కొద్ది రోజులు వాటిని చూడవద్దంటూ కూడా ప్రజలను కోరారు. అయితే సీఎం జగన్ చెప్పిన మాటలను విన్నవారంతా నవ్వుకున్నారు. గతంలో ఒత్తిన బటన్‌ల డబ్బులే ఇంకా రాలేదని, ఇపుడు ఒత్తే బటన్ పరిస్థితి కూడా ఇంతేనని, అదంతా బయట పడకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు ఇలా ప్రతిపక్ష పార్టీలను, తనకు అనుకూలంగా లేని పత్రికలపై ఆడిపోసుకుంటున్నాడన్న అభిప్రాయం వ్యక్తమయింది. ఒకవేళ సీఎం చెప్పిన దానిలో నిజం ఉంటే.. బటన్ నొక్కి రెండు వారాలైనా ఇప్పటికీ డబ్బు ఎందుకు పడలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ ఆసరా లబ్ధిదారులు పరిస్థితి..

గత ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నేత సీఎం జగన్ అలివి గాని హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తాను అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటానని, పొదుపు సంఘాలు 2019 ఏప్రిల్ వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తానని చెప్పారు. అందులో భాగంగా నాలుగో విడత నిధులను ఈ సంవత్సరం జనవరి 23న బటన్ నొక్కి విడుదల చేశారు. జిల్లాలోని 21017 గ్రూపుల్లోని 209707 మంది మహిళలకు రూ.136.18 లక్షలు విడుదల చేశామని, అవి త్వరలోనే లబ్ధిదారులు ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లాలోని ఆయా మండలాలు, వార్డుల వారీగా వైసీపీ నేతలు విపరీతంగా ప్రచారం చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లాలోని 50 శాతం మందికి కూడా వీటికి సంబంధించిన నిధులు జమ కాలేదని తెలుస్తోంది. సీఎం జగన్ బటన్ నొక్కి రెండు రెండు నెలలు గడిచినా ఇప్పటికి డబ్బులు వేయలేదని, ఇది తమను మోసం చేయటమేనని డబ్బులు అందుకోని మహిళలు మండిపడుతున్నారు.

ఏం చేశారని ఎమ్మిగనూరుకు వస్తున్నారు

సీఎం జగన్‌ను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీవీ

ఎమ్మిగనూరు, మార్చి 28: జిల్లాలో గతంలో ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకొని ఎమ్మిగనూరుకు వస్తున్నారని సీఎం జగన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ప్రశ్నించారు. గురువారం ఎమ్మిగనూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ కర్నూలులో హైకోర్టు, న్యాయరాజధాని ఏర్పాటు చేస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామని, మద్యనిషేధం, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ఓట్లకోసం నేడు జగన్ బస్సులో వస్తున్నారని ఇప్పుడు తెలుస్తుందని ఈ ఐదేళ్లలో రోడ్లు ఎలా ఉన్నాయోనన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో పిడికెడు మన్ను వేసిన పాపాన పోలేదన్నారు. ఎల్లెల్సీ కింద అదనంగా ఒక్క ఎకరాకు నీరు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. పశ్చిమ ప్రాంతంలోని ప్రజలకు సాగు,తాగునీరు అందించాలన్న సంకల్పంతో చంద్రబాబును ఒప్పించి ఆర్డీఎస్ కుడికాలువ కోసం రూ.2వేల కోట్లు మంజూరు చేయిస్తే రివర్స్ టెండర్ పేరుతో ప్రాజెక్టును సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు మాధవరావు దేశాయ్, రఘుమూర్తి స్వామి, మల్లికార్జున, బడేసాబ్, సుందరరాజు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

అధ్యక్షుడిగా బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా రవికాంత్ ప్రసాద్



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కార్యవర్గ సభ్యులు

కర్నూలు(లీగల్), మార్చి 28: ఉత్కంఠగా గురువారం జరిగిన కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలలో బి. కృష్ణమూర్తి అధ్యక్షుడిగా, బీఎస్ రవికాంత్ ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా ఘన విజయం సాధించారని ఎన్నికల అధికారి సి. ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. బి.కృష్ణమూర్తి తన సమీప ప్రత్యర్థి బి. చంద్రుడుపై 38 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కృష్ణమూర్తికి 358 ఓట్లు రాగా, చంద్రుడికి 320 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బీఎస్ రవికాంత్ ప్రసాద్‌కు 436 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి ఎం. వెంకటే శ్వర్లుకు 165 ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శిగా డి. విక్రమ్‌సింగ్, కోశాధికారి గా ఎం.మహబూబ్‌బాషా, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్. రామనాథ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా బి.సుధీర్, మహిళా ప్రతినిధిగా సుమన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకుముందు గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరిగింది. 850 ఓట్లు ఉండ గా.. 689 ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ను ప్రారంభించి సాయంత్రానికి ఫలితాలు ప్రకటించారు. బి. కృష్ణ మూర్తికి, బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లకు న్యాయవాదులు మిఠాయిలు అం దించి అభినం దనలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా సీ. ప్రభాకర్ రెడ్డి, మద్దెల శ్రీనివాస రెడ్డి, కే. రాజమోహన్ రెడ్డి, ఎస్‌పి ఇందుమతి, బాబా సాహెబ్ పాల్గొన్నారు.

రూ. 41.30 లక్షల బంగారం స్వాధీనం

ఆదోని, మార్చి 28 : ఆదోని రైల్వేస్టేషన్‌లో పోలీసులు జరిపిన సోదాలలో గురువారం రూ.41.30 లక్షల విలువ చేసే బంగారం స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. ఆదోని రైల్వే స్టేషన్‌లో బసవ ఎక్స్‌ప్రెస్ రైలులో ముల్లా అహమ్మద్ అనే వ్యక్తిని సోదా చేయగా బ్యాగులో రెండు బిస్కెట్ల బంగారం ముక్కలు లభించాయని ఆయన తెలిపారు. వీటి విలువ సుమారు రూ.41.30 లక్షలు ఉంటుందన్నారు. వీటికి బిల్లులు, రసీదులు చూపించకపోవడంతో ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించామని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

బాబు పర్యటనకు తరలి రండి



నాయకులు, కార్యకర్తలకు బీసీ పిలుపు

బనగానపల్లె, మార్చి 28: బనగానపల్లె పట్టణానికి శుక్రవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వస్తున్నం దున నాయకులు, కార్యకర్తలు ఉదయం 9.30 గంటల కల్లా తరలి రావాలని పిలుపుని చ్చారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనకు అంతం పలికేందుకు చంద్రబాబు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద భారీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి రావాలని బీసీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు టీడీపీ కార్యకర్తలు, నాయకులతో బీసీ సమా లోచన జరిపి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబునాయుడు పర్యటన ఇలా..

శ్రీసత్యసాయి జిల్లా కదిరి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు బనగానపల్లె పట్టణ శివారులోని క్రాంటిడ్డి లేఔట్ వద్దకు చేరుకుంటారు. ఇక్కడ ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కారులో బనగానపల్లె పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్దగల పెట్రోల్ బంకు కూడలికి 11 గంటలకు చేరుకుంటారు. ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు చైతన్య రథంపై జరిగే బహిరంగ సభలో చంద్రబాబునాయుడు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 12.40 గంటల నుంచి 1.40 గంటల మధ్యలో బీసీ నివాసంలో మధ్యాహ్న భోజనం చేస్తారు. భోజనం అనంతరం మధ్యాహ్నం 1.45 గంటలకు హెలికాప్టర్ ఎక్కి నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్తారు. నాయకులు, కార్యకర్తలకు కోవెలకుంట్ల రహదారిలోని మార్కెట్ యార్డు వద్ద, జీఎంఆర్ ఫంక్షన్ హాలు వద్ద, యాగంటి రహదారిలోని మర్రిమాను వద్ద భోజన వసతి కల్పించారు.



బనగానపల్లెలో సిద్ధం చేసిన హెలిప్యాడ్

సీమ ప్రాజెక్టులపై వైఖరి చెప్పాలి

- 12 నుంచి ప్రాజెక్టుల సందర్శన
- వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరిస్తాం
- సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, మార్చి 28 : రాయలసీమ ప్రాజెక్టుల పరిస్థితి నానాటికీ దిగుజారుతున్నదని, ప్రాజెక్టులపై అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. గురు వారం నంద్యాలలో సాగునీటి సమితి కార్యాలయంలో ప్రజా సం ఘాల నాయకులతో కలిసి తాగు, సాగు నీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడు తూ రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ స్థితిని సమాజం దృష్టికి తీసుకొని పోవడానికి ఏప్రిల్ 12వ తేదీ నుంచి ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించారు. ఒకే రాజధాని, మూడు రాజధానుల విధానాలను పాలకులు తమ ఆర్థిక, రాజకీయ సామ్రాజ్యాలను విస్తరించుకోవడానికి అమరావతిలో, విశాఖలో ఏర్పాటు చేయాలనుకుంటున్నారని విమర్శించారు. రాయల సీమ అభివృద్ధికి, రాయలసీమ యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేసే ఈ విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. పాలకుల అస్తవ్యస్త విధానాలతో రాయలసీమ యువతకు జరిగే నష్టాన్ని సమాజం ముందుం చుతామని అన్నారు. రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు, రాయలసీమ యువతకు రాష్ట్ర స్థాయి ఉద్యోగాలలో 40 శాతం రిజర్వేషన్లు, చిన్నాభిన్నమైన రాయలసీమ సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టే విషయంలో రాజకీయ పార్టీలు తమ కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, రాయలసీమ సాగునీటి సాధన సమితి కర్నూలు కార్యనిర్వాహక సభ్యుడు డేవిడ్, జనచైతన్య వేదిక నాయకులు శేషాద్రిరెడ్డి, రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పలువురు పాల్గొన్నారు



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్

- వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్
- ప్రచారంలో పాల్గొంటున్న ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు

కోసిగి, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి పది రోజులవుతున్నా గ్రామ వలంటీర్లు, ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎండీయూ ఆపరేటర్లు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. ఇప్పటికే కోసిగిలో వైసీపీ మండల ఇన్‌చార్జి మురళి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టారు. వైసీపీ నాయకులతో కలిసి ఇందులో ఎండీయూ ఆపరేటర్ బాలయేసు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బాలయేసుతో పాటు సుమారు పదిమంది వలంటీర్లు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు రోజూ వైసీపీ నాయకుల వెంట తిరుగుతూ ఎన్నికల ప్రచారాలు చేస్తున్నారు. వీరిపై నిఘా ఉంచాల్సిన అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోసిగికి చెందిన సుమారు ఐదుగురు వలంటీర్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు వైసీపీ ఎన్నికల ప్రచారాల్లో యథేచ్ఛగా పాల్గొడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



వైసీపీ ప్రచారంలో నాయకులతో కలిసి ఉన్న (రౌండప్)లో ఉన్న ఎండీయూ ఆపరేటర్ బాలయేసు

భార్యే నిందితురాలు

- కొడుకు, ప్రియుడు పాత్రధారులు
- పోలీసు విచారణలో అంగీకరించిన నిందితులు



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

దేవనకొండ, మార్చి 28: దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన పల్లె లక్ష్మన్న(55)ను కుటుంబ సభ్యులే హతమా ర్చిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దేవన కొండ సీఐ శ్రీనివాసులు వివ రాల మేరకు... గుండ్లకొండ గ్రామానికి చెందిన పల్లె లక్ష్మన్న, పద్మావతి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. లక్ష్మన్నకు కుమారుడు, కుమార్తె సంతానం. పద్మావతిది పత్తి కొండ మండలం చక్రాల గ్రామం. భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. అలిగి పద్మావతి పుట్టింటికి వెళ్లేది. చక్రాల గ్రామానికి చెందిన బోయ మల్లయ్యతో పద్మావతికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మన్న మద్యానికి బానిసై భార్యను వేధించేవాడు. దీంతో ఎలాగైనా భర్తను హత మార్చాలని కుమారుడు వెంకటేష్, ప్రియుడు మల్లయ్యతో కలిసి పద్మావతి పథకం వేసింది. ఇందులో భాగంగానే ఫిబ్రవరి 16న రాత్రి చిత్రా న్నంలో నిద్రమాత్రలు కలిపింది. అది తిన్న లక్ష్మన్న మత్తులోకి వెళ్లగా పథకం ప్రకారం కుమారుడు, ప్రియుడితో కలిసి ఉరివేసింది. చనిపోయిన తర్వాత కారులో మృతదేహాన్ని తీసుకువచ్చి పామిడి పెన్నానది ఒడ్డున కంపచెట్లలో పారేశారు. అనంతరం నెల రోజులకు తండ్రి కనిపించడం లేదని కుమారుడు పల్లె వెంకటేష్ దేవనకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పద్మావతితోపాటు ఆమె కుమారుడిని పోలీసులు తమదైన శైలిలో విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. విషయం తెలుసుకున్న సీఐ సిబ్బందితో పామిడి పెన్నానది ఒడ్డున ఉన్న మామిడితోట సరిహద్దులో వెతకగా అప్పటికే శరీరం కుళ్లిపోయింది. ఆ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేశారు. హత్యకు పాల్ప డిన భార్య పద్మావతి, కుమారుడు వెంకటేష్, మల్లయ్యలను అరెస్టు చేసి కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు.

వైద్య పరికరాల కొనుగోలుకు టెండర్లు



కర్నూలు జీజీహెచ్ పరికరాల కొనుగోలు టెండర్లను నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 28: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కోటి రూపాయల విలువ గల వైద్యపరికరాల కొనుగోలుకు గురువారం డిస్ట్రిక్ట్ పర్చేజ్ కమిటీ చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య టెండర్లు నిర్వహించారు. డెక్సాస్కాన్, మూడు అనస్థీషియా వర్క్ స్టేషన్లు, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలకు రెండు స్కానింగ్ మిషన్లు, 20 ఏసీల కొనుగోలుకు సంబంధించిన టెండర్లు వేసినట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. ఈ వైద్య పరికరాలను ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్) నిధుల నుంచి కొనుగోలుకు ఆమోదం లభించిందన్నారు. 20 ఏసీల్లో అత్యవసర విభాగమైన ఏఎంసీ, చిన్న పిల్లల అత్యవసర విభాగం ఎస్ఐసీయూ, పలు ఆపరేషన్ థియేటర్లలో త్వరలో అందుబాటులో తీసుకు వస్తామని చెప్పారు. ఈ వైద్య పరికరాల ద్వారా రోగులకు మెరుగైన సేవలతోపాటు వైద్యులకు పరిశోధన చేయడానికి ఉపయోగపడనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లయర్ షర్మిళ, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్; ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, ఆసుపత్రి ఏడీ అనిల్ కుమార్ రెడ్డి హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 28: ఏప్రిల్ 1వ తేదీ నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు లైట్లు, ఫ్యాన్లు, బాత్ రూమ్‌తోపాటు టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులను ఆదేశించారు. డీఆర్వో మధుసూదన్‌రావు, డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి ప్రసన్న, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఈడబ్ల్యూఐడీసీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూ.40 లక్షల లోపు ఖర్చు చేయాలి: జేసీ

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు రూ.40 లక్షల లోపు ఖర్చు చేయాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల ప్రవర్తనా నియామవళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అత్యవసర సమావేశాలకు ఒక్కరోజు ముందుగానే మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఇస్తామన్నారు. సమావేశంలో బీజేపీ ప్రతినిధి రామ్మోహన్ రెడ్డి, టీడీపీ ఛత్రపతిరెడ్డి, పాణ్యం నియోజకవర్గ ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

'టీడీపీ గెలుపుతోనే పల్లెల్లో ప్రగతి'

ఓర్వకల్లు, మార్చి 28: పాణ్యం నియోజకవర్గంలో టీడీపీని గెలుపుతోనే పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తాయని టీడీపీ సీనియర్ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నన్నూరు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్తూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించారు. నాయకులు ఖాజామియా, విజయుడు, శేఖర్‌రెడ్డి, సురేష్, అయ్యన్న, క్రిష్ణారెడ్డి, వేణుమాదవ్, నాసీర్, శేఖర్, షంషుద్దీన్, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

యథావిధిగా నీటి సరఫరా

కర్నూలు(న్యూసిటీ), మార్చి 28: నగర పాలక సంస్థ పరిధిలోని నంద్యాల చెక్‌పోస్టు బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదురుగా 250 ఎంఎం పైప్‌లైన్ మరమ్మతుల పనులు పూర్తి కావడంతో యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని కమిషనర్ ఎ. భార్గవతేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19, 20, 21 వార్డులైన గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, చంద్రశేఖర్ నగర్, మారుతినగర్, బృందావన్‌నగర్, సరస్వతినగర్, జయరాంనగర్, ధనలక్ష్మీనగర్, వాసవినగర్, బీటీఆర్‌నగర్, మాధవినగర్, కమలానగర్, లక్ష్మీనగర్, శ్రీనగర్ కాలనీ, ఎన్జీఓస్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, తదితర ప్రాంతాలలో నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందన్నారు.

కోడుమూరులో టీడీపీ జెండా ఎగరడం ఖాయం

గూడూరు, మార్చి 28: కోడుమూరులో టీడీపీ జెండా ఎగరడం ఖాయమని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూ రు నగర పంచాయతీ పరధిలోని కోట వీధిలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, యువ టీడీపీ నేత సృజన్ ఆధ్వర్యంలో ఇంటిం టికీ వెళ్ళి బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటి కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు మల్లాపు బుడ్డం గలి, షాషా వలి, పౌలు, తెలుగు శ్రీనివాసులు, కుమార్, విజయ్ కుమార్, పెద్ద చాంద్ బాషా, మాజీ కౌన్సిలర్ మధుసూదన్, కళ్యాణ్ రఘు, అద్దు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

కర్నూలు, మార్చి 28: త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ వెంకట సురేష్ ఆధ్వర్యంలో అమ్మ హాస్పిటల్, సాంస్కృతి పార్క్, డాక్టర్స్ కాలనీల్లో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట సురేష్ హెచ్చరించారు.

టీడీపీని గెలిపించుకుందాం

కోడుమూరు, మార్చి 26: తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందామని పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎల్లప్ప నాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 248 బూత్ పరిధిలోని షణ్ముఖరెడ్డి నగర్, ఇంద్రజిత్, రజక వీధిలో ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను గూర్చి ప్రజలకు వివరించారు. అలాగే టీడీపీ మండల కార్యదర్శి, టీఎన్‌టీయూసీ తాలుకా అధ్యక్షులు రవీంద్ర, గోపాల్‌నాయుడు పట్టణంలోని 15, 16 వార్డుల్లో ప్రచారం చేశారు. బూత్ కన్వీనర్ కేఈ బడెషాగౌడ్, శివ, గిడ్డయ్య, లోకేశ్‌గౌడ్, వీరేష్, నరసింహ, రామేశ్వరమ్మ, శ్రీనివాసనాయుడు, పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

» గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలోకి చేరికలు




గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

కల్లూరు, మార్చి 28: ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం, 33వ వార్డు కల్లూరులో అధికార పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్నికల ముందు వైసీపీకి ఆ పార్టీ ముఖ్య నాయకులు ఝలక్ ఇచ్చారు. గురువారం నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో హుస్సేనాపురం గ్రామ సర్పంచు గోవర్ధనమ్మ, ఆమె భర్త మాజీ కాల్వబుగ్గ దేవస్థానం చైర్మన్ పెద్దస్వామితోపాటు వంద కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. గౌరు దంపతులు టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామాల్లో మౌలిక వసతులకు నిధులు లేకుండా చేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సర్పంచు గోవర్ధనమ్మ, కాల్వబుగ్గ దేవస్థాన మాజీ చైర్మన్ పెద్దస్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నన్నూరు విశ్వేశ్వరరెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కనమడకల సుధాకరయ్య, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిన 33వ వార్డు వైసీపీ నాయకులు:** కల్లూరు అర్బన్ 33వ వార్డు కల్లూరుకు చెందిన సల్కాపురం రాజశేఖర్‌తోపాటు 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. గురువారం గౌరు దంపతులు టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో డేవిడ్, నర్సప్ప, సురేష్, ఇమ్మానుయేలు, అశోక్, నాని, లింగన్న ఇసాక్ ఉన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎన్‌వీ రామకృష్ణ, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, ఎస్.ఫిరోజ్, పవన్‌కుమార్, సంపతి లక్ష్మీరెడ్డి చిన్నశేషన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రజాసంక్షేమం: టీడీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత పిలుపునిచ్చారు. గురు వారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని శంఖారావం సూపర్‌సిక్స్ పథకాల కర పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం వైసీపీ వార్డు మెంబర్ టీకే.చిరంజీవితోపాటు 15 కుటుంబాలు గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో డి.రామాంజనేయులు, వాకిటి మాదేష్, ఎంపీటీసీ మేకలశేషన్న, మహానంది, శేఖర్, రామగిడ్డయ్య, రవి, లక్ష్మన్న, హుస్సేన్, నాగేశ్వరరావు, తిరుమలేశ్వరరెడ్డి, పల్కాపురం దేవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

● **31వ వార్డులో గౌరు జనార్దన్‌రెడ్డి ప్రచారం:** 31వ వార్డు రామ్ రహీమ్‌నగర్, షరీఫ్‌నగర్‌లో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి గురువారం ప్రచారం చేశారు. టీడీపీ సూపర్‌సిక్స్ ఎన్నికల మ్యానిఫెస్టోను ఇంటింటికీ తిరిగి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురుషోత్తం, భాస్కర్‌రెడ్డి, పుల్లయ్య, జనసేన నాయకుడు అశోక్, సునీల్, కిరణ్, పాల్గొన్నారు.

మతం పేరుతో ఓట్లు అడిగే వారిని నమ్మొద్దు

ముస్లిం మహిళలకు టీజీ భరత్ విజ్ఞప్తి

కర్నూలు(అర్బన్), మార్చి 28: మతం పేరు చెప్పి ఓట్లు అడిగే వారిని నమ్మొద్దని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ముస్లిం మహిళలకు విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం నగరంలోని 48, 49 వార్డులకు చెందిన ముస్లిం మహిళల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీజీ భరత్ పాల్గొని ప్రసంగించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ముస్లింలకు ఎంతో మేలు జరిగిం దన్నారు. మరి కొద్దిరోజుల్లో రంజాన్ పండుగ రాబోతుందని, తమ ప్రభుత్వం ఉంటే రంజాన్ తోఫా ప్రతి ముస్లిం కుటుంబానికి అందించే వారమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రంజాన్ తోఫాను ఎత్తేసిందన్నారు. పేద ముస్లిం మహిళల పెళ్లిళ్ల కోసం దుల్హన్ పథకాన్ని చంద్రబాబు నాయుడు అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక లక్ష రూపాయలు అందిస్తామని చెప్పి ఆ తర్వాత నిబంధనలు పెట్టి ముస్లింలకు అందకుండా చేశారన్నారు. కార్యక్రమంలో ముస్లిం మహిళలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల మాటలు నమ్మవద్దు: తాము 40 ఏళ్లుగా రాజకీయాలకు అతీతంగా కర్నూలు ప్రజలకు సేవచేస్తున్నామని, 20 రోజుల కింద వచ్చి ప్రజలకు సేవ చేస్తాం - ఓట్లేయండి అనే వ్యక్తిని నమ్మకండని కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని పెద్దపడఖానాలో నిర్వహించిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం అధికారంలో లేకపోయినా ప్రజాసేవ మరువలేదన్నారు. తమ ప్రత్యర్థి స్థానికేతరుడని, ఎన్నికల్లో ఓడిపోతే ఆయన ఊరు విడిచి వెళ్లిపోతారని అన్నారు. అయితే తాము గెలిచినా, ఓడినా కర్నూలు ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పరమేష్, కర్నూలు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణుడు, బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంజీవలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీ భరత్

టీడీపీలో చేరిక: నగరంలోని 3వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి కురువ చిన్న భీమన్న తెలుగుదేశం పార్టీలో చేరారు. మౌర్యఇన్‌లో కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ సమక్షంలో చిన్న భీమన్నతోపాటు ఆయన అనుచరులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్ని కల్లో టీడీపీ బలోపేతానికి తాము కృషి చేస్తామని పార్టీలో చేరిన నేతలు తెలిపారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూల్లో ప్రతి వార్డులో టీడీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. పార్టీలో చేరిన వారిలో వినీత్ కుమార్, మహేష్, పరమేష్, దివాకర్ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నాగ వీరాంజనేయులు, రాజేశ్వరీ, శేషగిరి శెట్టి పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 28: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించు కోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణపై పాణ్యం నియోజ కవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గం రెండు జిల్లాల్లో ఉన్నందున ఆ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను కర్నూలులోనే స్వీకరిస్తారన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 3,22,494 మంది ఓటర్లు ఉండగా- 1,57,113 మంది పురుషులు, 1,65,306 మంది స్త్రీలు, 75 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 357 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఎంసీసీ నియమాలను ఉల్లంఘించిన నలుగురు వలంటీర్లను సస్పెండ్ చేశామన్నారు.

కర్నూలు(న్యూసిటీ): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియో గించుకోవాలని కర్నూలు అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలు 2024 పురస్కరించుకుని స్వీప్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అందరితో ఆర్వో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు పెంచలయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఆర్పీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

మార్చి 17 వరకు ఓటరు నమోదు: ఆర్వో

కర్నూలు(న్యూసిటీ), మార్చి 28: యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు మార్చి 17 వరకు అవకాశం ఉందని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ అన్నారు. గురువారం కార్యాలయంలో ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ నియో జకవర్గంలోని 33 వార్డులలో 258 పోలింగ్ కేంద్రాలలో 2,96,097 మంది ఓటర్లు (పురుషులు-1,46,685, మహిళలు-1,49,412)ఉన్నారని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటు తొలగించడం, ఓటు ఇతర చోటుకి బదిలీ చేయడాన్ని ఈ నెల 26 నుంచి నిలిపివేస్తామన్నారు. అసెంబ్లీ పరిధిలో 23 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు. పాతబస్తీ, బుధవారపేట, రోజా, బండిమెట్టతోపాటు మిగిలిన సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కోరామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కర్నూలు(రూరల్), మార్చి 28: కర్నూలు రూరల్ మండలంలోని సుంకేసుల, ఆర్.కొంతలపాడు, తొలిశాపురం, గొందిపర్ల, దేవమాడ, ఉల్చాల, రేమట, ఎల్‌పేట, స్టాంటన్‌పురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కోడుమూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేషిరెడ్డి గురువారం పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కోడుమూరు నియోజకవర్గంలో 275 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అందులో కర్నూలు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించిన మూడు వార్డులు స్టాంటన్‌పురం, మామిదాలపాడు, మునగాలపాడు, మాసమసీదు, గీతాముఖర్జీనగర్ కలిసి 27 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. కర్నూలు రూరల్ మండలంలో 113 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

నకిలీ డాక్టర్లతో ప్రాణాలకు ముప్పు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 28: జిల్లాలో నకిలీ డాక్టర్లతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా వేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. నకిలీ డాక్టర్లుగా చెలామణి అవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీసాల సుమలత మాట్లాడుతూ నగరంలోని గాయత్రీ ఎస్టేట్, మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో నకిలీ డాక్టర్లు క్లినిక్‌లు నడుపుతున్నారన్నారు. జిల్లా వైద్యాధికారులు నకిలీ డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకో వాలని కోరారు. కార్యక్రమంలో షాకీర్, ఫరీదా పాల్గొన్నారు.

టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసి పని చేయాలి

కర్నూలు(అర్బన్), మార్చి 28: కోడుమూరు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరికి సీటు ఇచ్చిన అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంత రత్నం మాదిగ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోడుమూరు నియోజకవర్గం సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీసీ ఆధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐన్‌టీయూసీ జిల్లా ఆధ్యక్షులు బీ. బతుకన్న, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రమీల, తిరుపాలు, మల్లికార్జున, ఖలీల్, మిన్నెల్లా, బాలముని, లలిత, హైమావతి, హరి పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు(రూరల్), మార్చి 28: కోడుమూరు సెబ్ పోలీసులు భారీగా కర్ణాటక మద్యం పట్టుకున్నారు. సెబ్ సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ సి.బెళగల్ మండలం పల్‌దొడ్డి గ్రామం వద్ద రెండు బైక్‌లపై తరలిస్తున్న 20 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులు పోలకల్‌కు చెందిన నాగరాజు, నాగేష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే కొత్తకోట వద్ద బైక్‌పై తరలిస్తున్న రెండు బాక్సుల మద్యం పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు మార్కాపురానికి చెందిన తిరుమల, శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి మద్యం, బైకులు సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ. 1.33 లక్షలు ఉంటుందన్నారు. ఈదాడుల్లో ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, వీరుపాక్షిరెడ్డి, వెంకటేష్‌నాయక్, అన్సార్ బాషా, ఇంటలీజెన్స్ కానిస్టేబుల్ అయ్యన్న మొబైల్‌పార్టీ రామచంద్ర పాల్గొన్నారు.

హెల్త్ ఇన్‌స్పెక్టర్ దాడి చేశారు..

కర్నూలు(హాస్పిటల్), మార్చి 28: హెల్త్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి బారి నుంచి తనను రక్షించాలంటూ ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు మొరపెట్టుకున్నారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ తనపై కక్ష కట్టి నానా దుర్భాషలాడి దాడి చేశారని, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ ఉద్యోగి మల్లికార్జున ఆసుపత్రి సూపరిం టెండెంట్ వి.వెంకటరంగారెడ్డికి గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం శానిటేషన్ ఆఫీసు వద్ద పిడిగుద్దులు గుద్దుతూ ఆయన దాడి చేశారని మల్లికార్జున సూపరింటెండెంట్‌కు తెలిపారు. దీనిపై సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ పెస్ట్ కంట్రోల్ ఉద్యోగి గురువారం ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ చేయిస్తానని తెలిపారు.

రేపు కర్నూలుకు ఉడిపి
శ్రీకృష్ణ పలిమారు మఠం పీఠాధిపతి

కర్నూలు(కల్చరల్), మార్చి 28: ఉడిపి శ్రీకృష్ణ పలిమారు మఠం పీఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామి, మఠం ఉత్తరాధికారి విద్యా రాజేశ్వరాతీర్థస్వామి శనివారం కర్నూలుకు విచ్చేస్తున్నట్లు నగర బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు కేసీ కల్కూర తెలిపారు. గురువారం సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఆర్ కాలనీలోగల ఆచార్య మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య స్మారక వేద విద్యా భవన్ భూమి పూజ కార్యక్రమానికి పీఠాధిపతి విచ్చేస్తున్నట్లు తెలిపారు.

వైసీపీలో బెస్తలకు అన్యాయం

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 28: వైసీపీ పాలనలో బెస్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఏమీ ఉద్ధరించామని చెప్పడానికి సీఎం జగన్ మేము సిద్ధం బస్సు యాత్ర చేపడుతున్నారో సమాధానం చెప్పాలని బెస్త సాధికార నంద్యాల కమిటీ జిల్లా అధ్యక్షుడు పీజీ వెంకటేశ్ అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని బెస్త సాధికార కమిటీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 28: పదో తరగతి పరీక్షల మూల్యాంకనం కేంద్రంలో వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖ ఏడీ శ్యామూల్ పాల్‌కు యూటీఎఫ్ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులైన ఉపాధ్యాయులకు మూల్యాంకనం విధుల నుంచి మినహాయించాలని కోరారు. ఏడీకి వినతిపత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటిల్, ఆర్థిక కార్యదర్శి యేహోవా, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, దుర్గాప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ జయరాజు ఉన్నారు.

ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి: పదో తరగతి పరీక్షల మూల్యాంకనం కేంద్రంలో ఆరోగ్య సమస్యలున్న ఉపాధ్యాయులకు మిన హాయింపు ఇవ్వాలని ఏడీ శ్యామూల్‌పాల్‌కు పీఆర్‌టీయూ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూల్యాంకనం విధు లకు ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలన్నారు. ఏడీకి వినతి సమర్పించిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ క్రిష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ ఉన్నారు.

పెండింగ్ రెమ్యునరేషన్ చెల్లించాలి: గత ఏడాది జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు పెండింగ్ రెమ్యునరేషన్ నిధులను చెల్లించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రామశేషయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌ను గురువారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించిన పది పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం ముగిసి ఏడాది గడిచినా ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రెమ్యునరేషన్ డబ్బులు నేటికీ ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. డీఈవోను కలిసిన వారిలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి నందీశ్వరుడు ఉన్నారు.



విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

హస్తకళల అభివృద్ధికి సహకారం అవసరం



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(కల్చరల్), మార్చి 28: చేనేత, హస్తకళల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవీ ఫంక్షన్ హాలులో శ్రీ కళని చేనేత హస్తకళా మేళా ప్రదర్శనలు, అమ్మకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చేనేత, హస్తకళా ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి ఉందన్నారు. శ్రీకళని సంస్థ నిర్వాహకులు ఎస్. హుస్సేన్, దుర్గారావు మాట్లాడుతూ తమ చేనేత, హస్తకళా ప్రదర్శనలు ఏప్రిల్ 12 వరకు కొనసాగుతాయని, ప్రతిరోజు ఉదయం పది నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శనలు ఉంటాయని అన్నారు.

ముస్లిం మహిళలకు గొడుగుల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్), మార్చి 28: పేద ముస్లిం మహిళలకు నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని గురుదత్త పాలిక్లీనిక్‌లో డాక్టర్ శంకర్ శర్మ గొడుగులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ వేసవిలో మండుటెండల నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఎండలో తిరగడం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మీసాల సుమలత, మహిళలు పాల్గొన్నారు.




గొడుగులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ఆది దంపతులకు గజ వాహన సేవ

కోడుమూరు(రూరల్), మార్చి 28: గోరంట్లలో లక్ష్మీమాధవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి అమ్మవార్లకు గజ వాహనసేవ నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. గజవాహనంపై ఉంచి రాజగోపురం ద్వారం గుండా ఆలయం వెలుపలికి తోడ్కొని వచ్చారు. అక్కడ ప్రత్యేకంగా తయారు చేసిన ప్రభపై గజవాహనం అమర్చి శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. దీంతో గోరంట్ల, ఎర్రగుడి గ్రామాల భక్తులు ప్రభను లాగుటకు పోటీపడ్డారు. గజవాహనసేవలో ఉత్సవమూర్తులను ఎదురుమం డపం వరకు లాగి తిరిగి ఆలయం చేర్చారు. కార్యక్రమంలో ఈవో గుర్రెడ్డి, సిబ్బంది మురళి, మాధవనాయుడు పూజారులు హరిస్వామి, రాజేష్, రమణ, పురుషోత్తం, వెంకటరమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివాదంతో సరిపెట్టిన సీఎం జగన్

బస్సు ఆపకుండా వెళ్లిపోయారని నిరుత్సాహానికి గురైన కార్యకర్తలు



జగన్ బస్సు వద్ద వైసీపీ కార్యకర్తలు

ఓర్వకల్లు, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మేము సిద్ధం కార్యక్రమంలో భాగంగా నంద్యాలలో బహిరంగ సభను ముగించుకుని సీఎం జగన్ రోడ్డు మార్గాన ప్రత్యేక బస్సులో హుసేనాపురం, నన్నూరు మీదుగా గురువారం రాత్రి 9 గంటల సమయంలో వెళ్లిపోయారు. హుసేనాపురంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్సు నుంచి దిగి మాట్లాడుతాడని ప్రజలు బస్టాండు వద్దకు చేరుకున్నారు. అయితే బస్సులో నుంచి అభివాదం చేస్తూ నవ్వుతూ రెండు చేతులెత్తి నమస్కరించి సీఎం వెళ్లిపోయారు. బస్సు ఆపకుండా వెళ్లడంతో నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు. అనంతరం నన్నూరు టోల్‌ప్లాజా వద్ద బస్సు మెట్టు దిగి రెండు చేతులెత్తి నమస్కరించి సీఎం వెళ్లిపోయారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

నేడు ఎమ్మిగనూరుకు సీఎం రాక

ఎమ్మిగనూరు, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సీఎం జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరుకు రానున్నారు. ఎన్నికల ప్రచారం కోసం బస్సులో ఎమ్మిగనూరుకు చేరుకుంటారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో ఏర్పాటు చేసిన మేము సిద్ధం సభలో పాల్గొంటారు. ఈ మేరకు గురువారం సభకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక అభ్యర్థి బుట్టా రేణుక పరిశీలించారు.

సత్తా చాటిన అనాథ విద్యార్థులు

ఎమ్మిగనూరు, మార్చి 28: పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ఉన్న పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీలో చదువుతున్న అనాథ, పేద విద్యార్థులు 12 మంది గురుకుల ప్రవేశపరీక్షల్లో సత్తాచాటారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, కుటుంబ పోషణ కోసం వలస వెళ్లిన కుటుంబాలకు చెందిన పిల్లలు 20మంది విద్యార్థులు 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశపరీక్షకు హాజరయ్యారు. ఇందులో 12మంది విద్యార్థులు ఎంపికయ్యారు. దీంతో వీరిని గురువారం సొసైటీ నిర్వాహకులు ప్రతిభా భారతి, నరసన్న అభినందించారు. కమిటీ సభ్యులు నాగరాజు, తిరుపతి, ప్రసాద్, మనోహర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

తుగ్గలి, మార్చి 28: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని జీ. ఎర్రగుడి, కడమకుంట్ల తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ షర్మిళ, ఆర్ఐ సుధాకర్ రెడ్డి, వీఆర్వోలు లక్ష్మి, రంగన్న, గోవిందప్ప, రంగప్ప తదితరులు ఉన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్

మద్దికెర, మార్చి 28: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన జీఎస్ శ్రీకాంత్‌ను ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌బాషా గురువారం ఉత్తర్వులు పంపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లడుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి రంగన్న ఆధ్వర్యంలో జిల్లా కౌన్సిల్‌లో జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారన్నారని తెలిపారు. మండలాల్లో విద్యార్థుల సమస్యలపై పరిష్కరించేందుకు పోరాటం చేస్తానని పేర్కొన్నారు. అనంతరం శ్రీకాంత్‌ను ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు సన్మానించారు.

రంగనాథుని హుండీ లెక్కింపు

మద్దికెర, మార్చి 28: పెరవలిలోని రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తాత్కాలిక హుండీ, శాశ్వత హుండీ, సేవా టికెట్ల ద్వారా గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2.35 లక్షల ఆదాయం వచ్చింది. గురువారం దేవాలయ ప్రాంగణంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడు, ప్రధాన అర్చకులు రంగనాథ స్వామి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేయగా.. కల్యాణోత్సవంలో స్వామివారికి భక్తులు రూ.3,68,172, సేవా టికెట్ల ద్వారా రూ.2,48,690, శాశ్వత హుండీ ద్వారా రూ.9,66,742, తాత్కాలిక హుండీ ద్వారా రూ.6,37,042, మొత్తం రూ.22,17,652 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

అశ్వ వాహనంపై రంగనాథ స్వామి దర్శనం

మద్దికెర, మార్చి 28: పెరవలి గ్రామం రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగనాథుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం మూలవిరాట్ రంగనాథస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అర్చకులు పంపిణీ చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో అధిష్టించి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు, ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

మెరిసిన విద్యా కుసుమం

దేవనకొండ, మార్చి 28 : దేవనకొండకు చెందిన ఆవుల హంసిక వర్షిణి గురుకుల పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో 21, రాయలసీమ జోనల్ స్థాయిలో 55వ ర్యాంకు సాధించింది. గురుకుల పరీక్ష ఫలితాల్లో ర్యాంకు సాధించడం పట్ల విద్యార్థిని తల్లిదండ్రులు, సరస్వతి పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

టీడీపీ అభ్యర్థుల విజయం కోసం పని చేస్తా : బత్తిన



నారా లోకేశ్‌ను కలిసిన బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, మార్చి 28: తెలుగుదేశం పార్టీ విజయం కోసం అహర్నిశలు పని చేస్తానని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. గురువారం మండల పరిధిలోని రామలింగాయపల్లిలో బత్తిన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాదులో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసి టీడీపీ భవిష్యత్ ప్రణాళికపై చర్చించామన్నారు. నారా లోకేశ్‌ను కలిసి తనకు టికెట్ ఇవ్వాలని కోరానని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేస్తే అందుకు తగ్గ హోదా పదవి ఇచ్చి న్యాయం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారని బత్తిన పేర్కొన్నారు.

నేటి నుంచి 11వ ఆరాధనోత్సవాలు

మంత్రాలయం, మార్చి 28: రాఘవేంద్రస్వామి పూర్వ పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల 11వ మహా సమారాధనోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ నెల 29న పూర్వారాధన, 30న మధ్యారాధన, 31న పూర్వారాధన, మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. సుయతీంద్రతీర్థుల మూలబృందావనానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ పూజలు నిర్వహించనున్నారు. మధ్యారాధన రోజు బంగారు రథంపై సుయతీంద్రతీర్థుల చిత్రపటాన్ని అధిష్ఠించి ఊరేగించనున్నారు. యాగశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ సేవా రంగాల్లో పలు సేవలు చేసిన వారికి పీఠాధిపతి అవార్డులు ప్రదానం చేయనున్నారు. మూడు రోజులుగా జరిగే ఉత్సవాలకు మఠం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైసీపీ కార్యక్రమాల్లో బుక్ కీపర్లు

విధుల నుంచి తొలగించాలని తహసీల్దార్‌కు వినతి



వైసీపీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న బుక్ కీపర్లు రంగడు, సుధాకర్

వెల్దుర్తి, మార్చి, 28: మండలంలో చెరుకులపాడు, కొసనపల్లె గ్రామాలలో బుక్ కీపర్లుగా విధులు నిర్వహిస్తున్న రంగడు, సుధాకర్‌లు ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని వారిని తక్షణ మే విధుల నుండి తొలగించాలని తహసీల్దార్ అనంత ఆచారికి గురువారం చెరుకులపాడు వాసులు వినతి పత్రం అందజేశారు.

వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తా

● దీర్ఘకాలికంగా ఉన్న తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తాం

● టీడీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు



గూళ్యంలో పంచలింగాల నాగరాజును సన్మానిస్తున్న కురువ సంఘ నాయకులు

ఆలూరు, మార్చి 28 : వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న వేదవతి, నగరడోన ప్రాజెక్టులు పూర్తిచేసి తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీడీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి పంచలింగాల నాగరాజు అన్నారు. గురువారం ఆలూరు పట్టణంలో టీడీపీ, కురువ సంఘాల నాయకులు ఘనస్వాగతం పలికారు. స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్థానిక అంబేడ్కర్, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అత్యంత వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో శాశ్వతసాగునీటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణానికి దృష్టి సారిస్తామన్నారు. కురువ సామాజిక వర్గానికి చెందిన సామాన్య వ్యక్తి అయిన తనను గుర్తించి కర్నూలు పార్లమెంట్‌కు అవకాశం కల్పించడం పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఆయన వెంట ఆలూరు, పత్తికొండ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు కురువ జయరామ్, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు కురువ దేవేంద్ర, బెంగళూర్ కిషోర్, నరసప్ప, నారాయణ, సురేంద్ర, గూళ్యం రామాంజినేయులు, సుధాకర్, లక్ష్మన్న, వెంకటేష్, రంగయ్య, విష్ణు, రఘుబాబు, మల్లికార్జున, రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గాదిలింగేశ్వర స్వామి దర్శనం

హాలహర్వి : ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు గూళ్యంలో వెలసిన గాదిలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కురువ సామాజిక వర్గీయులు సన్మానించారు. హాలహర్వి జెడ్పీటీసీ లింగప్ప, పత్తికొండ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, కురువ జయరాం, శ్రీధర్ పాల్గొన్నారు.

పెద్దహోతూరులో పర్యటన

ఆలూరు : బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ కురువ జయరామ్‌తో కలిసి టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు పెద్దహోతూర్ గ్రామంలో పర్యటించి ఉచ్చీరప్ప తాత ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట సర్పంచు వీరేశ్, నాయకులు లక్ష్మన్న, మాజీ సర్పంచ్ తిమప్ప తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

ఆస్పరి : గూళ్యం గాదిలింగప్ప తాత దర్శనార్థం ఆస్పరి మీదుగా వెళ్తున్న పంచలింగాల నాగరాజు ఆస్పరిలోని అంబేడ్కర్ సర్కిల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ యాదవ్, మండల కన్వీనర్ పరమారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు మాజీ ఎమ్మెల్యే సత్కారం



టీడీపీ నాయకులను సన్మానిస్తున్న బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, మార్చి 28: టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తున్న సీనియర్ నాయకులను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి సన్మానించారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాబుసాబ్, రఘుమూర్తి స్వామి, హాజీ బడేసాబ్, లియాకత్ అలీ, మిఠాయి నరసింహులు, కొండయ్య చౌదరి, ఇబ్రహీం, షరీఫ్, నరసింహులు, నభిసాబ్, శంకరన్న, ఉసేన్‌సాబ్, వెంకటకృష్ణమనాయుడు, మాబు, రజాక్, అల్లాబకాష్, మాబులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బార్ అసోసియోషన్ అధ్యక్షుడిగా గురురాజు

ఎమ్మిగనూరు, మార్చి 28: ఉత్కంఠభరితంగా జరిగిన ఎమ్మిగనూరు బార్ అసోషియోషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గురురాజరావు, కార్యదర్శిగా రఘురాం విజయం సాధించారు. గురువారం కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి యు రంగనాథ్ పర్యవేక్షణలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 వరకు జరిగాయి. సాయంత్రం 5గంలకు ఓట్ల లెక్కించారు. బార్ అసోసియేషన్‌లో 93మంది సభ్యులు ఉండగా 88మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పటికే మిగతా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికకావటంతో అధ్యక్షకార్యదర్శులకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. ఎన్నికల నిర్వహణలో సహాయక అధికారులుగా కుమార్, లింగమూర్తి, రామూర్తి పాల్గొన్నారు.

వైసీపీ పథకాలన్నీ స్కాములే

● టీడీపీ మంత్రాలయం అసెంబ్లీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, మార్చి 28: రాష్ట్రంలో ప్రతి పథకాన్ని స్కాము చేసిన వైసీపీ సీఎం జగన్ రెడ్డిని సాగనంపేందుకు రోజులు దగ్గర పడ్డాయని మంత్రాలయం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం తన స్వగృహంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. వైసీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ మాయలు, మోసపూరిత వాగ్దానాలన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ రెడ్డి, మంత్రాలయంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్టారెడ్డి, బొజ్జప్ప, కౌలుట్లయ్య, రామయ్య, నాగరాజు, భీమిరెడ్డి, కేశన్న పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే.. మూడు సిలిండర్లు ఉచితం



కోసిగిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాఘవేంద్రరెడ్డి, నాయకులు

కోసిగి : టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని మంత్రాలయం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. స్థానిక 9వ వార్డుకు చెందిన రామలక్ష్మి అనే మహిళ సిలిండర్‌ను తలపై మోసుకువెళ్తున్న సమయంలో రాఘవేంద్రరెడ్డి ఆ మహిళ వద్దకు వెళ్లి టీడీపీ గెలిస్తే మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే కోసిగిలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా కోసిగయ్య, బీరప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉలిగయ్య, ముత్తురెడ్డి, రామిరెడ్డి, జ్ఞానేష్, రామక్రిష్టారెడ్డి, నర్సారెడ్డి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యం

● ప్లాట్ కబ్జా చేసి యథేచ్ఛగా ఇంటి నిర్మాణం

● పట్టించుకోని అధికారులు



2 (2020 సంవత్సరంలో మంజూరైన పట్టా ఇదే)

తుగ్గలి, మార్చి 28: బొందిమడుగుల గ్రామంలో అధికార పార్టీ వైసీపీకి చెందిన నాయకుడు దౌర్జన్యంగా ఓ స్థలాన్ని ఆక్రమించి యథేచ్ఛగా చేపట్టిన ఇంటి నిర్మాణం వెలుగులోకి వచ్చింది. గురువారం గ్రామానికి చెందిన బాధితురాలు సువర్ణ, ధనుంజయలు తమ గోడును వినిపించారు. తమ పూర్వీకుల నుంచి ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నామని, అధికారులు సర్వే.నెంబర్. 511లోని పట్టా.నెం. పీకేఎన్ఎల్. 01795161 పొజిషన్ సర్టిఫికేట్ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే, ఇదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వీరా దౌర్జన్యంగా తమ స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ దౌర్జన్యంపై బుధవారం పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ షర్మిళ, తుగ్గలి ఎస్ఐ మల్లికార్జునను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఇంత వరకు అక్రమ కట్టడం మాత్రం నిలిపివేయడం లేదని, దర్జాగా నిర్మాణ పనులు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తనకు రక్షణ కల్పించి నిర్మాణ పనులు ఆపి గ్రామంలో విచారణ చేపట్టాలని కోరారు. తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కన్నీరు పెట్టారు.

వడ్డీ మాఫీ అవకాశాన్ని వినియోగించుకోవాలి

ఆదోని టౌన్, మార్చి 28 : పట్టణ పరిధిలోని ఆస్తి పన్ను బకాయి ఉన్న వారికి వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఇచ్చినా అవకాశం ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి కోరారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఒక పారిశ్రామిక సంస్థ వారు పాత బకాయి ఏక కాలంలో చెల్లించి రూ. ఒకటిన్నర కోటి వడ్డీ మాఫీను వినియోగించుకున్నారని, ప్రభుత్వం ప్రకటించిన ఈ సదవకాశాన్ని బకాయి దారులందరూ వినియోగించుకోవాలని కోరారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ఆదోని టౌన్, మార్చి 28 : వేసవికాలం కావడంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే గ్రామీణ ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ప్రధాన రహదారిలోని మున్సిపల్ షాపుల సముదాయం ఎదురుగా ఆర్యవైశ్య ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) అధ్యక్షుడు, వ్యాపారవేత్త వంకదారు శ్రీనాథ్ గుప్తా సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మిరియాల భద్రీనాథ్ పాల్గొన్నారు.


ఉచితం పేరుతో దోపిడీ

● రూ.లక్షల్లో వసూళ్లు

● అందరూ వాటాదారులే..

మద్దికెర, మార్చి 28: "పేదలందరికీ ఉచితంగా నీరందిస్తాం.. వారి దాహార్తి తీర్చడమే మా ధ్యేయం" అంటూ పంచాయతీ పాలకవర్గం జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఉచితంగా ఇంటింటికీ నీరందిస్తున్నారు. అయితే.. ఉచితం పేరుతో ప్రజల వద్ద నుంచి లక్షల్లో దోచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీలో మొత్తం 4,950పైగా గృహాలున్నాయి. గతంలో 1,595 మంది రూ.6వేల ప్రకారం పంచాయతీలకు డిపాజిట్ చెల్లించి కొళాయిలు వేసుకున్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ పథకం కింద జగనన్న కాలనీలో, సాయినగర్ కాలనీలో ఉచిత కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. పంచాయతీ పాలకవర్గం అధికారులు ఏకమై జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ సొంత కొళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. ఒక్కొక్క ఇంటికి అధికారికంగా రూ.1000 వసూలు చేస్తున్నారు. ఇలా మద్దికెరలో ఇప్పటి వరకు దాదాపు 2,500 వరకు ఉచిత కనెక్షన్లు ఇచ్చారు. ఈ లెక్కన రూ.800 నుంచి రూ.1000 వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామంలో ప్రజల వద్ద నుంచి వసూలు చేస్తున్న లక్షలాది రూపాయలు అధికారులకు, నాయకులకు వాటాలుగా ముడుతున్నందువల్లనే ఎవరూ ఏమీ అనడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా ఆదాయమే ధ్యేయంగా పని చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఉచిత కొళాయి కనెక్షన్లపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి స్వర్ణలత మాట్లాడుతూ తమ దృష్టికి రాలేదని, ఎవరైనా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.


రూ.800 ఇచ్చా



మద్దికెర పంచాయతీ వారు ఉచిత కొళాయి కనెక్షన్లు ఇస్తున్నారని నేను కొళాయి వేయించుకున్నా. రూ.800 ఇప్పించుకున్నారు. మెటీరీయల్‌కు రూ.2వేలు ఖర్చు అయింది. మొత్తం రూ.2,800 చెల్లించా. ఉచితం అంటూ డబ్బులెందుకు తీసుకుంటున్నారో?

- పులికొండ, గ్రామస్థుడు

ఉచితం అన్నారు.. డబ్బులు వసూలు చేస్తున్నారు



పంచాయతీవారు ఉచితంగా కొళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. కనెక్షన్ ఇవ్వాలంటే డబ్బు చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఉచితం అంటూనే ఇలా మోసగిస్తున్నారు. డబ్బులు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి.

- రామేశ్వరమ్మ, గ్రామస్థురాలు

30న రన్ ఫర్ జీసస్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న రన్ ఫర్ జీసస్ కమిటీ సభ్యులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 28 : ఈ నెల 30న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని క్రైస్తవులంతా విజయవంతం చేయాలని నిర్వాహకులు రెవరెండ్ పాస్టర్ భాస్కర్ బాబు, సునీల్ రాజ్ కుమార్, పాస్టర్ విక్టర్ ఫిలిప్ కోరారు. గురువారం విక్టోరియా పేట క్రైస్ట్ చర్చిలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవుల్లో ఐక్యత చాటేందుకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 30న ఉదయం 6 గంటలకు బైపాస్ రహదారిలోని మహిమ ప్రార్థన మందిరం నుంచి కొత్త బస్టాండ్, ఎమ్మిగనూరు సర్కిల్, బీమాస్ సర్కిల్, మున్సిపల్ మెయిన్ రోడ్ మీదుగా విక్టోరియా పేట క్రైస్ట్ చర్చి వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడితోట శాంతకుమార్, పాస్టర్ బెనర్జీ రాజు, సంగటి దేవదానం, ఆశీర్వాదం, థామస్, మనోహర్, జకరయ్య పాల్గొన్నారు

కూటమి అభ్యర్థి విజయానికి కృషి

● మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



మీనాక్షినాయుడు

ఆదోని, మార్చి 28 : టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి పార్థసారథి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. గురువారం ఆయన తన నివాసంతో కార్యకర్తలతో మాట్లాడారు. పొత్తులో భాగంగా తనకు టికెట్ రాకపోవడంపై అధినేత చంద్రబాబు నాయు డు చాలా బాధపడ్డారని, ఆయన కళ్లలో ఆవేదన చూశానని అన్నారు. అందుకే తన సీటును త్యాగం చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినేత ఆదేశాలకు కట్టుబడి, పొత్తు ధర్మంలో భాగంగా బీజేపీ అభ్యర్థికి సహకరించి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కురువ సామాజిక వర్గానికి చెందిన పంచలింగాల నాగరాజుకు కేటాయించడం శుభపరిణామమన్నారు.

టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి

గోనెగండ్ల, మార్చి 28: టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ మైనార్టీ కమిటీ సభ్యులు నూరహమ్మద్, టీడీపీ మండల నాయకులు కొత్తింటి ఫక్రుద్దీన్, బారతం రహంతుల్లా ప్రశ్నించారు. గురువారం వారు మాట్లాడుతూ జగన్ సీఎం అయిన తరువాత ముస్లింలకు ఒక్క మంచి పనికూడా చేయలేదని విమర్శించారు. ముస్లింల కోసం ఇస్లామిక్ బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించి ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు.

కనకవీడులో విగ్రహ ప్రతిష్ఠ

నందవరం, మార్చి 28: కనకవీడు గ్రామంలో గురువారం వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఉదయం వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చన, దూపదీపాలతో పూజలు చేశారు. చిన్నారులు కలశాలతో గ్రామంలో ఊరేగించారు. టీడీపీ నాయకులు డబ్బా ఈరన్న, ఈరన్న, రాంబాబు, అనుమంతు, మునెప్ప, చిన్నబీమన్న పాల్గొన్నారు.

శ్రీ మఠం అన్నదానానికి రూ.20 లక్షల విరాళం

మంత్రాలయం, మార్చి 28: రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన అజ్ఞాత భక్తుడు రూ20.లక్షల చెక్కును విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. గురువారం పోస్టు ద్వారా చెక్కును రాఘవేంద్ర స్వామి మఠం అన్నదానం కార్యక్రమానికి విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, ప్రసాదం పోస్టు ద్వారా పంపుతున్నట్లు తెలిపారు.

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 28: జగన్ సభ ఉందంటే ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఇదే పరిస్థితి తాజాగా ఎమ్మిగనూరులో చోటు చేసుకుంది. జగన్ పర్యటనలో భాగంగా ప్రొద్దుటూరు, నంద్యాల, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో సిద్ధం సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభలకు ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి దాదాపు 49బస్సులను వైసీపీ అద్దెకు తీసుకుంది. దీంతో సగానికి పైగా బస్సులు ఆయా ప్రాంతాలకు వెళ్లటంతో ప్రయాణికులు బస్సులకోసం గంటల తరబడి బస్టాండ్‌లో వేచి చూడాల్సి వచ్చింది.

వెల్దుర్తి యువకులు టీడీపీలో చేరిక



శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వెల్దుర్తి యువకులు

వెల్దుర్తి, మార్చి, 28 : పట్టణంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు సమక్షంలో నూతనంగా ఓటు హక్కు పొందిన వెల్దుర్తి యువకులు టీడీపీలో చేరారు. ఎస్.బాబురావు, ఎం.చిట్టిబాబు, ఎం. మధుకిరణ్, అశోక్, రాంబాబు, మండల అధ్యక్షులు బలరాంగౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, రమాకాంత్‌రెడ్డి, రామచంద్ర నాయుడు, హోటల్ శ్రీను, బాలరాజు, బజారు పాల్గొన్నారు.

పత్తికొండ : భూమి పూజలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు తప్ప నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీదేవి చేసిన అభివృద్ధి శూన్యమని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో పందికోన రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామని, బాలికల బీసీ హాస్టల్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో హామీలను విస్మరించి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని పర్యటిస్తారని విమర్శించారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, మార్చి 28: ఎండలు మండిపోతున్నాయని, వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా అన్నారు. గురువారం గ్రామంలో వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైతేనే బయటకు రావాలని, లేకపోతే రాకూడదన్నారు. వేసవి కాలంలో దుస్తులు కూడా సలపాగా ఉండాలన్నారు. వడదెబ్బ బారిన పడితే వెంటనే చెట్టుకిందకు తీసుకెళ్లి తడివస్త్రం ద్వారా శరీరమంతా తుడువాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి

ఆదోని, మార్చి 28: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని టూటౌన్ సీఐ గోపీనాథ్ పేర్కొన్నారు. గురువారం ఆదోని పట్టణంలో అసెంబ్లీ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా సెంట్రల్ ఫోర్స్‌తో ఫ్లాగ్‌మార్చ్ చేశారు. ఆదోని పట్టణం నందు బీమాస్ సర్కిల్, మట్కారిగేరి, చిన్నమార్కెట్, చాంద్‌సా దర్గా మీదుగా ఎస్కేడీ కాలనీ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

'ఎడెక్స్ కంపెనీతో ఒప్పందం దుర్మార్గం'

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 28: రాష్ట్ర ప్రభుత్వం ఎడెక్స్ కంపెనీతో రూ.50 కోట్లు ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ అన్నారు. గురువారం పట్టణంలోని నారాయణ కళాశాలలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి సభను పీడీఎస్‌యూ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంతో ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని సంక్షోభంలోకి నేడుతూ పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్ విద్య పేరుతో టెండర్లుకు కూడా పిలవకుండా ఎడెక్స్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిరుమలేష్, మహిళ నాయకురాలు శ్రావణి, మనోజ్, గిడ్డయ్య, విశ్వనాథ్, నవీన్, నిఖిత పాల్గొన్నారు.